నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 26 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర అబ్జర్వర్లు

బైంసా, సెప్టెంబర్ 25 : పట్టణం లోని అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర అబ్జర్వర్‌లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓవైసీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించి.. చిన్నారుల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారం గురించి తెలుసుకున్నారు. ఇందులో రాష్ట్ర అబ్జర్వర్‌లు ప్రదీప్, శ్రావణ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్ర అబ్జర్వర్లు

గోలి శంకర్ మరణం పార్టీకి తీరనిలోటు

మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : గోలి శంకర్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం శంకర్ గుండెపోటుతో తనువుచాలించగా.. ఆయన పార్థివదేహంపై పార్టీ కండువా కప్పి కడసారి వీడ్కోలు పలికారు. అంతిమ యాత్రలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న

నేర పరిశోధన స్థలంలో ఫింగర్‌ప్రింట్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్ నిర్వహణ

- నిర్మల్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : పోలీసు అధికారులు, సిబ్బంది పనితనాన్ని మెరుగుపరిచేందుకు జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లను నిర్వహిస్తామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లాస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ డ్యూటీ మీట్‌లో నేర పరిశోధన, నేరస్థల పరిశోధన, వీఐపీ మూమెంట్, డాగ్ స్క్వాడ్ పనితీరును పరిశీలించారు. అలాగే ఫింగర్ ప్రింట్‌పై పరిశోధన, బాంబు డిస్పోజల్ టీం విధులు, కంప్యూటర్‌పై నైపుణ్యం, నేరస్థలం వద్ద ఫొటోగ్రఫీ, అవాంఛనీయ ఘటనలు సంభవించినప్పుడు వీడియోగ్రఫీ తీయు విధానం వంటి అంశాలలో రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి నగదు రివార్డును అందజేస్తామని తెలిపారు. ఈ పరీక్షలు కొన్ని అంశాలు ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి వారికి, మరికొన్ని ఏఎస్ఐ నుంచి కానిస్టేబుల్ వరకు జరుగుతాయని తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి అత్యధిక నగదు బహుమతి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్) సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

యూ-బిట్ దర్యాప్తులో ముందడుగు

తాజాగా ముగ్గురు అరెస్టు.. ఎనిమిదికి చేరిన సంఖ్య..

- అరెస్టయిన ముగ్గురూ ప్రభుత్వ ఉపాధ్యాయులే..
- కీలక కుట్రదారుడు గుర్తింపు.. బ్యాంకు ఖాతాల స్తంభన..
- ఫిర్యాదుకు ముందుకు రావాలని పోలీసుల పిలుపు..

అరెస్టు అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 25 ః యూ-బిట్ క్రిప్టో కరెన్సీ మోసం కేసులో పోలీసులు మరో ముందడుగు వేశారు. ప్రజలను మోసం చేసిన ఘటనలో గతంలో ఐదుగురిని అరెస్టు చేయగా.. బుధవారం మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న దాసరి రమేశ్, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సొనాల ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న బొమ్మిడి ధనుంజయ్, నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ కాలనీకి చెందిన వెంకటేశ్, కుభీర్ మండలంలోని దౌజినాయక్ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. వీరంతా యూ బిట్, క్రిప్టో కరెన్సీ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం, అధిక రాబడులు వస్తాయని తప్పుడు వాగ్దానాలు ఇచ్చి ప్రజల్లో ఆశలు రేకెత్తించి పెట్టుబడులు పెట్టేందుకు కీలకపాత్ర పోషించారు.

కీలక కుట్రదారు గుర్తింపు

యూ బిట్ పథకం వెనుక ఉన్న ప్రధాన కుట్రదారుడిని పోలీసులు గుర్తించారు. భారత దేశం అంతటా పెద్ద సంఖ్యలో ప్రజలను మోసం చేసి ఈ స్కామ్‌ను నిర్వహించిది బ్రిజ్ మోహన్ సింగ్ అని పోలీసులు తేల్చారు. ఇతనిపై దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇతను క్రిప్టో కరెన్సీ ముసుగులో పెద్ద ఎత్తున పెట్టుబడి దారులతో పెట్టుబడులు పెట్టించినట్లు గుర్తించారు. ఇటీవల అరెస్టయిన వారు ఎనిమిది నెలలుగా రహస్య సమావేశాలు నిర్వహించేందుకు, నాలుగు వేర్వేరు దేశాలకు వెళ్లారని, దీని పరిధిని విస్తరించడానికి సమావేశాలు నిర్వహించినట్లు విచారణలో తేల్చారు.

బ్యాంకు ఖాతాల స్తంభన

క్రిప్టో కరెన్సీలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించిన ఖాతాలను పోలీసులు స్తంభింపజేశారు. కోట్లాది రూపాయలతో ఈ వ్యవహారం కొనసాగుతుండగా.. ఈ వ్యవహారంలో ముడిపడి ఉన్న 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ఆస్తులను గుర్తించే ప్రక్రియలో పోలీసులు నిమగ్నమయ్యారు. యూ బిట్, క్రిప్టో కరెన్సీ బాధితులు ముందుకొచ్చి స్టేట్‌మెంట్‌ను అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే కేసు దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు అండగా ఉంటామన్నారు. బాధితులు కోల్పోయిన పెట్టుబడులు తిరిగిచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. దర్యాప్తు అధికారి, ఏఎస్పీ అవినాశ్, సహాధికారులు గోపీనాథ్, ఎస్సైలు లింబాద్రి, దేవేందర్, రవి, సాయికృష్ణ, గౌష్‌లను ఎస్పీ జానకి షర్మిల ప్రశంసించారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

రూ. 2.25 కోట్ల విలువ గల 900 కిలోల గంజాయి స్వాధీనం

ఆదిలాబాద్ జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడ్డ నిందితులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఆదిలాబాద్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలను ఎస్పీ గౌష్ ఆలం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గంజాయి రవాణా అవుతుందనే సమాచారం మేరకు మహారాష్ట్ర సరిహద్దున గల ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐచర్(యూకే 08 సీబీ 5318) వాహనం మహారాష్ట్రకు వెళ్తుండగా పట్టుకున్నారు. వాహన డ్రైవర్‌ను విచారించగా ఉత్తరఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అన్షు జైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్‌జీ, సోను అన్సారీలు మూడేండ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. వాహనంలో 292 ప్యాకెట్లలోని రూ.2.25 కోట్ల విలువ చేసే 900 కిలోల గంజాయి ఉన్నట్లు తెలిపారు. గంజాయి రవాణాలో ఒడిశా రాష్ట్ర మల్కన్‌గిరికి చెందిన ఆశీష్, ఉత్తరప్రదేశ్‌లోని కనంపూర్ మీరుట్ చెందిన పండిత్ జీ, ఐచర్ డ్రైవర్ వసీం అన్సారీ, క్లీనర్ అర్మాన్, అన్షుజైన్‌లతోపాటు మహారాష్ట్ర బుల్దానకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులు, డీఈవోను సస్పెండ్ చేయాలి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 25 : యూ-బిట్ కాయిన్ వ్యవహారంలో ఆర్థిక నేరాలకు పాల్పడిన ఉపాధ్యాయులు, డీఈవోపై చర్యలు తీసుకోవడమే కాకుండా వారిని సస్పెండ్ చేయాలని పీఆర్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యాకటారి సాయన్న అన్నారు. బుధవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ వ్యవహారంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ఉన్నారని, వీరిపై పోలీసు అధికారులు నిఘా పెంచాలన్నారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టి వేయబడుతోందని డీఈవోపై నమ్మకం లేనందున కలెక్టర్ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంఎన్‌వో(మండల నోడల్ ఆఫీసర్) సీనియర్ పీజీ హెచ్ఎంలకు బదులుగా జూనియర్లను నియమించడం సమంజసమని, వారిని ఎఫ్ఏసీ ఎంఈవోలుగా నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, చంద్రశేఖర్, నర్సయ్య, గంగయ్య, మధుసూదన్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని

ప్రతిభను వెలికి తీయడానికే యువజనోత్సవాలు

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : యువతలోని ప్రతిభను వెలికితీయడానికే యువజనోత్సవాలు ఉపయోగపడుతాయని జడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. వివిధ కళాశాలలు, పాఠశాల విద్యార్థులతోపాటు కళాకారులు పాల్గొని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా జడ్పీ డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ.. యువతలోని నైపుణ్యాలను వెలికియడానికి యూత్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, డీఐఈవో రవీందర్, న్యాయనిర్ణేతలు కబీర్ దాస్, సతీశ్ దేశ్‌పాండే, సల్ల విజయబాబు, ప్రతాప్ సింగ్, జగదీశ్, వజ్రమాల, కవిత, వ్యాకృత మసూద్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 25 : వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల అవగాహన, వినోదాల పరంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వృద్ధాశ్రమాలలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రుల పోషణ, ఆరోగ్య రక్షణపై అవగాహన ర్యాలీ, సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రుల పోషణ రక్షణ చట్టం 2007 పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవోలు సూపర్ వైజర్లు, వయోవృద్ధుల కమిటీ సభ్యులు లింగన్న పాల్గొన్నారు.



వయోవృద్ధుల సంక్షేమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ఈనెల 30న రైతు హామీల సాధన దీక్ష

- 24 గంటలు రైతులతో కలిసి హైదరాబాద్‌లో దీక్ష
- బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 30న బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద 24 గంటలపాటు రైతులతో దీక్ష నిర్వహిస్తామని బీజేపీ సభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. నిర్మల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్క హామినీ పూర్తిగా అమలు చేయలేదని, లక్ష రుణమాఫీకి గత సర్కార్ రూ.19 వేల కోట్లు ఖర్చు చేసిందని, రూ.2 లక్షల మాఫీకి దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చవుతాయని తెలిపారు. ఇప్పటి వరకు కేవలం రూ.17 వేల కోట్లను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసిందని అన్నారు. ఇంకా రూ.18 వేల కోట్లు మాఫీకి అవసరం ఉండగా.. ప్రభుత్వమేమో రుణమాఫీ పూర్తయిందనడం సమంజసం కాదని పేర్కొన్నారు. హైడ్రా పేరిట హిందువుల ఆస్తులను టార్గెట్ చేస్తున్నారని, పాతబస్తీ జోలికి వెళ్లడం లేదన్నారు. హైడ్రా ముసుగులో ప్రభుత్వం దందా చేస్తుందని ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్, నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జీతాలియ్యండి..

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేశ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లో కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. ప్రతి నెలా ఐదో తారీకు లోపు వేతనాలు చెల్లించాలన్నారు. ఐదు నెలల ఈపీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ చేయాలన్నారు. రెండో పీఆర్సీలో కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈ ధర్నాలో మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ వాటర్ సెక్షన్ అధ్యక్షుడు అడ్డూరి ఆత్మారాం, డ్రైవర్ సెక్షన్ ప్రెసిడెంట్ జనార్దన్, అజీమ్ శివ ప్రసాద్, గంగన్న, భూమన్న, శ్యాం పాల్గొన్నారు.

యువత వివేకానందుని అడుగుజాడల్లో నడవాలి

నిర్మల్‌లో ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 25 : యువత స్వామి వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతనం 10 అంశాలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు నృత్యాలు, డాన్యులు, పాటలు అందరిని ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

పోర్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

2024-25 మొదటి త్రైమాసిక సమావేశం

ఎదులాపురం, సెప్టెంబర్ 25 : జిల్లా క్రెడిట్ ప్లాన్ 2024-25 మొదటి త్రైమాసిక సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని అజెండా అంశాలవారీగా సమావేశంలో వివరించారు. ప్రాధాన్యత రంగం, బలహీన వర్గాలకు క్రెడిట్ ప్రవాహం, విద్యా రుణాలు, ఎస్ఎంఈ ఫైనాన్సింగ్ అండ్ అడ్డంకులు ఏవైనా ఉంటే, పంట రుణాలు వ్యవసాయ రంగ 2024-25 లక్ష్యాలు, విజయాలను సమీక్షించారు.ఐడీఎం, బ్యాంక్ అధికారులు, సీఎన్‌సీ ప్రాజెక్ట్ మేనేజర్ హరికృష్ణ, జిల్లా మేనేజర్ రాహుల్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కడెంలో ప్రైవేట్ దవాఖానను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి రాజేందర్

కడెం, సెప్టెంబర్ 25: నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రుల నిర్వహణ, వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు అతిక్రమించిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి రాజేందర్ హెచ్చరించారు. బుధవారం కడెం మండల కేంద్రంలో పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రులను రిజిస్ట్రేషన్ చేసుకోకుండా, సరైన అర్హతలు లేకుండా చికిత్సలు అందిస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్సలు మాత్రమే అందించాలని, యాంటీ బయోటిక్స్ సెలైన్ బాటిల్స్ పెట్టరాదని అన్నారు. మెడికల్ లేబోరేటరీలను కూడ విధిగా నమోదు చేసుకున్న తర్వాతనే పరీక్షలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అనంతరం ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహణాధికారి శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ అధికారి బారే రవీందర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ఉట్నూర్, సెప్టెంబర్25 : ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని గిరిజన సంక్షేమశాఖ హైదరాబాద్ కార్యాలయ వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక హెచ్ఎన్‌టీసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ ఆదాయం వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రకృతి సేద్య పద్ధతులలో ఏర్పాటు చేసిన వరి, టమాట, పసుపు, మునగ పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో సందీప్ కుమార్, ఉద్యానవన అధికారి సుధీర్ కుమార్, సాంకేతిక అధికారిణి అర్షిత, రైతులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న సంధ్యారాణి